క్లుప్తంగా

వెంకటాపురం గెడ్డలో పూడికతీత



గెడ్డలో పొక్లెయిన్‌తో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రధాన గెడ్డలో పూడికలను జీవీఎంసీ అధికారులు తొలగింపజేశారు. గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై మురుగుతో ఇక్కట్లు శీర్షికతో సాక్షిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు సిబ్బందితో గెడ్డలో పూడికలను తీయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు అంతా దిగువకు ప్రవహిస్తుండడంతో దుర్గంధం, దోమల బాధ తగ్గిందని తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత



ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న వైద్యురాలు రాధిక

గోపాలపట్నం: సింహాచలం ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేయడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లను గోపాలపట్నం రాధికా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రాధిక అందించారు. సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ బస్సుల్లో ఉండే ఫస్ట్ ఎయిడ్ కిట్లను పరిశీలించి 134 కిట్లు అందించారన్నారు. దీంతో పాటు కిట్లలో పాడైన, కాలం చెల్లిన మందులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వైద్యురాలు రాధిక మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఈ కిట్లు అందించామన్నారు. కిట్లు అందించిన డాక్టర్ రాధికకు డిపో మేనేజర్ రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీకి కుర్చీలు, చాపల వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు అందిస్తున్న హెచ్‌పీసీఎల్ ఉద్యోగి దంపతులు

సింథియా: జాతి స్ఫూర్తి ప్రదాతలు బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే, బాబూజగ్జీవన్‌రామ్ జయంతి మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం హెచ్‌పీసీఎల్ ఉద్యోగి పీవీ రమణ, అరుణ అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు అందజేశారు. కార్యక్రమంలో గుడాల బాబూరావు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు పెయ్యల సిద్ధార్థ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కోరమాండల్ గేటు ఎదురుగా స్థానిక శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ యువత రక్తదానం చేసి పలువురికి ప్రాణదానం చేయాలని కోరారు. కోరాడ శ్రీను మాట్లాడుతూ శిబిరంలో 86యూనిట్ల రక్తాన్ని సేకరించి, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్‌కు అందించినట్లు చెప్పారు. స్థానిక నాయకులు రామ్మోహన్‌నాయుడు, ఎదుర శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాదచారులకు మజ్జిగ, మినరల్ వాటర్‌ను కోరాడ శ్రీను పంపిణీ చేశారు.

జగన్‌కు అశేష ప్రజాదరణ

- ఓర్వలేక పచ్చనేతల పిచ్చి ప్రేలాపనలు
- వారి కుటిల యత్నాలను తిప్పికొట్టండి
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి పిలుపు
- ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్



58వ వార్డులో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు



60వ వార్డులో ప్రభుత్వ పాలనపై మహిళ అభిప్రాయం తెలుసుకుంటున్నకార్పొరేటర్ సురేష్

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన అశేష ఆదరణ చూసి ఓర్వలేక దుష్టచతుష్టయంతో పాటు పచ్చ నేతలు కుటిలయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఇంత మంది ఏకమై ఒక మనిషిపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్ ప్రాంతంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎంత మంది ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట తప్పరన్నారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరలా మీరంతా ఆశీర్వదించాలని అక్కడ నివాసీయులను కోరారు. తన పాలనలో మేలు జరిగిందటేనే అండగా నిలవాలని సీఎం జగన్ స్పష్టంగా చెబుతున్నారు.. ఈ మాదిరి పచ్చనేతలు చెప్పగలరా ,ఆ ధైర్యం వారికి ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గులిగిందల కృష్ణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి,తోసంగి వెంకటరమణియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- 60వ వార్డు నెహ్రూనగర్ సచివాలయం పరిధిలో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పరిపాలన ఎలా ఉంది.. ఏమైనా లోపాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సూర్యరావు, గుల్లల రాజు,గృహసారథులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని ఇండస్ట్రియల్‌కాలనీలో నాయకుడు సోనూ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

ప్రతీ ఇంట్లో సంతోషం

గోపాలపట్నం: ప్రతీ ఇంటా సంతోషాలే కనిపిస్తున్నాయి.. మళ్లీ జగనన్నే కావాలని ప్రజలు చూపిస్తున్న అభిమానం ఎంతో బలాన్నిస్తోందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు కొత్త కరాసాలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. చాకలి వీధి నుంచి కొత్త కరాసా వరకు ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనుల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, అనురాధ, పేడాడ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

అంతటా ఒకటే నినాదం

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిని సందర్శించి వారి సమ్మతితో ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.



గత ప్రభుత్వానికి జగనన్న ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని వివరిస్తున్న జియ్యాని శ్రీధర్

- జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

‘పశ్చిమ’ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఆడారి ఆనంద్‌కుమార్



సభలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు.58వ వార్డు ఎదురవానిపాలెంలో కోరమాండల్ సంస్థ రూ. 19 లక్షల వ్యయంతో నిర్మించనున్న సామాజిక భవనం పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు పరిశ్రమల సాయంతో మురికివాడలు,కొండ వాలు ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీవీఎంసీ నిధులతో పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య,నాయకులు కృష్ణ,ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, ఎదుర అప్పలస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



జిమ్‌ను ప్రారంభిస్తున్న రంగనాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ఎదురవానిపాలెం గ్రామంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ రూ. 5 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ జిమ్‌ను సంస్థ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఇ.రంగనాయకులు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సీఎస్ఆర్ నిధులతో గ్రామంలో జిమ్‌తో పాటు బోరుబావిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోరమాండల్‌ను ఆనుకున్న ఉన్న గ్రామాల్లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్స్, ఔషధమొక్కలు నాటడం, పది రూపాయలకే కార్పొరేట్ వైద్యం, తక్కువ ధరకే మందులు తదితర కార్యక్రమాలతో పాటు నిరుద్యోగులకు వృత్తి శిక్షణ తరగతులు, మహిళలకు కుట్టుమిషన్లు, క్రీడాకారులకు కిట్లు అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు నాగరాజు, శ్రీకాంత్, పిల్లా నారాయణపాత్రుడు, ఎస్. వెంకటరమణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన ‘వెండి అంచులు’



వెండి అంచులు నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వెండి అంచులు నాటకాన్ని ప్రదర్శించారు. పల్లూరూ శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి గంగోత్రిసాయి దర్శకత్వం వహించగా.. సంగీతం సత్యనారాయణమూర్తి సమకూర్చారు. ఏడు పదుల దాటిన వయసులో పురుషుడు తనకంటే చిన్నది అయిన మహిళను పెళ్లి చేసుకోవచ్చా అనే అంశంపై ప్రదర్శించిన నాటక అందరిని మేల్కొలిపింది.

అనంతరం రెండో నాటకంగా పెందుర్తికి చెందిన శ్రీనటరాజ డ్రమటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనుకోని అతిథి నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా, పిల్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు. మనిషి బతకడానికి కావల్సింది డబ్బే కాని.. డబ్బే సర్వస్వం కాదనే ఇతి వృత్తంతో సాగిన ఈ నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత



ఆలయ బేడా మండపంలో సిద్ధం చేసిన శానలు

సింహాచలం: సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ఠ, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా శానలను ఏర్పాటు చేశారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ త్రివిక్రమ్ వర్మ



జడ్జి గోపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం జిల్లా జడ్జి జి.గోపిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ–2 ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) నాగన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రహల్లాదపురంలో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 55 ఏళ్ల గల వ్యక్తిని మంగళవారం రాత్రి సమయంలో ప్రహల్లాదపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో గోశాల నుంచి గోపాలపట్నం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడ్ని గుర్తిస్తే 9440796020, 08912520933 నంబర్లకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

గోపాలపట్నం: గోపాలపట్నంలో నాలుగు కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. గంజాయి తరలిస్తున్నట్టు వచ్చిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోపాలపట్నం నాయుడు క్వార్టర్స్ వద్ద ఇద్దరు వ్యక్తుల్ని పట్టుకున్నారు. గోపాలపట్నంకు చెందిన అప్పారావు, రాజేష్‌కుమార్ నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎత్తు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మల్కాపురం: నిర్మాణం జరుగుతున్న ఎత్తయిన ప్రదేశం నుంచి జారి పడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక పరిధి మింది సమీపంలోని గుడివాడ అప్పన్నకాలనీ ప్రాంతంలో బొడ్డేటి కుమార్ (34) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. కుమార్ 20 రోజులుగా తన బంధువైన ఈశ్వరరావు వద్ద షెడ్ కట్టే పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో డాక్‌యార్డ్ సమీపంలోని ధనలక్ష్మి గొడౌన్స్‌లో రేకుల షెడ్ వద్ద బుధవారం మధ్యాహ్నం పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో షెడ్‌పై సిమెంట్ రేకులు బిగించడం కోసం పైకి ఎక్కిన కుమార్ షీట్‌పై కాలు వేయడంతో అదుపు తప్పి. కిందికి జారిపోయాడు. తీవ్రగాయాల పాలైన కుమార్‌ను బంధువుల సాయంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడి బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ లూథర్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



కొత్తపాలెం సబ్ స్టేషన్ వద్ద బ్రేక్‌ను ఆన్ చేస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

గోపాలపట్నం: వేసవిలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. కొత్తపాలెం యల్లపువానిపాలెం ప్రాంతాల్లో వేసవి ఇబ్బందులు ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తపాలెం సబ్ స్టేషన్‌లో నూతనంగా కొత్త బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీన్ని బుధవారం ఎస్ఈ మహేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికరం ఖరీదు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. దీని వల్ల వేసవిలో విద్యుత్ అదనపు లోడును తట్టుకుని నిరంతరాయంగా విద్యుత్ అందిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ఈఈ ఎం. శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన



ఈఈ సంతోషి కుమారితో మాట్లాడుతున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిధిలో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు జీవీఎంసీ ఈఈ సంతోషి కుమారితో కలసి ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోపాలపట్నం బంక్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు రహదారులను పరిశీలించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే విషయంపై చర్చించారు. గతంలో జంక్షన్ల వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో మరో స్పీడ్ బ్రేకర్ వేయాలని నిర్ణయించారు. మరికొన్ని చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. అయితే, వీటితో పాటు బీఆర్‌టీఎస్ రహదారి, సర్వీస్ రోడ్లలో ఉన్న గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 59వ వార్డు లక్ష్మీనగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి, పథకాలు అందనివారుంటే వలంటీర్లకు తెలియజేయాలని సూచించారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న నంబర్ వన్ స్టూడెంట్స్ దర్బార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, సర్వజ్ఞ సంస్థ ప్రతినిధులు

గోపాలపట్నం: నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు సర్వజ్ఞ సంస్థ, నంబర్ వన్ ఓటీటీ సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని నరవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కళాశాలలో నంబర్ వన్ స్టూడెంట్స్ దర్బార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్వజ్ఞ సంస్థ సీఎండీ మంచాల సాయి సుధాకర్ నాయుడు, సీఈవో డోలే నాథ్ మాట్లాడుతూ ఈ నెల 28న నరవ విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నంబర్ వన్ స్టూడెంట్స్ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశ స్థాయి పెట్టుబడి దారులు, వెంచర్ క్యాపిటలిస్టులు, అంతర్జాతీయ స్థాయి నిపుణులు, విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ ముఖ్య అధికారులు, బ్యాంక్ అధికారులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ కోడ్, పాస్ కోసం 93925 02849 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రూ.1.75 కోట్లతో శాంతివనం అభివృద్ధి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మాట్లాడుతన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని కరాసా శాంతివనం అభివృద్ధికి రూ 1.75 కోట్లు మంజూరయ్యాయని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ఎన్ఏడీ జంక్షన్‌లోని యునైటెడ్ క్రైస్ట్ చర్చి 40 ఏళ్ల ఉత్సవాలను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వీరు మాట్లాడుతూ ఎన్ఏడీ జంక్షన్‌లోని యునైటెడ్ చర్చి దినదినాభివృద్ధి చెందిందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ గెడ్డ రిటైనింగ్ వాల్స్‌కు రూ.75లక్షలు, మోడల్ ప్రేయర్ హాల్‌కు రూ.50లక్షలు, శాంతివనం ఆర్చి నిర్మాణానికి రూ.20 లక్షలు, బ్యూటిఫికేషన్‌కు రూ.10లక్షలు, బోర్‌వెల్, మోటార్‌కు రూ.5లక్షలు, లైటింగ్‌కు రూ.5లక్షలు, వాకింగ్ పాత్‌వేకు రూ.5లక్షలు, వాల్ డ్రాయింగ్ పెయింటింగ్ పనులకు రూ.5లక్షలు ఇటీవలే జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు చేత మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ , కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ బీఎస్ కృష్ణ, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పూజలు



భద్రాచలంలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, డ్వాక్రా ఆర్పీలు

సీతంపేట: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడు గుళ్ల నుంచి బస్సులో యాత్రకు బయలుదేరిన విషయం తెలిసిందే. మార్గమధ్యలో అనకాపల్లి నూకాలమ్మ, తలుపులమ్మ లోవలో అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రార్థించారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని సీతమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సీతారాములకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గత నాలుగేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మరలా సీఎం కావాలని యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్ పాల్గొన్నారు.